క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జిల్లెలగూడ ఫీడర్ పరిధిలోని మందమల్లమ్మ చౌరస్తా నుంచి టీకేఆర్ కమాన్ వరకు, శక్తినగర్, అంబేద్కర్‌నగర్, న్యూ గాయత్రినగర్, ఓల్డ్ గాయత్రినగర్, డీఆర్ఆర్ హోమ్స్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ లలితానగర్ ఫీడర్ పరిధిలోని లలితానగర్, గాయత్రిహోమ్స్, గాయత్రినగర్, సీతాహోమ్స్, జిల్లెలగూడ విలేజ్, వెంకటేశ్వర కాలనీ, మిథులానగర్, సత్యసాయి ఎన్‌క్లేవ్, కమలానెహ్రూనగర్, డీఎస్ఆర్ నగర్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

వేడుకలకు ఆహ్వానం



ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆహ్వానిస్తున్న మహేశ్ తదితరులు

పహాడీషరీఫ్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు హాజరు కావాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీ యువన్ స్కూల్ యజమాన్యం ఆహ్వాన పత్రం అందజేసింది. ఈ మేరకు పాఠశాల చైర్మన్ మహేశ్, ప్రిన్సిపాల్ సుజాతలు కోరారు. బీఆర్ఎస్ నాయకులు పల్లపు శంకర్, యంజాల అర్జున్‌లతో కలిసి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. శనివారం సాయంత్రం జరిగే పాఠశాల గ్రాడ్యుయేషన్ డే, మహిళా దినోత్సవ వేడుకలకు విచ్చేయాలని విజ్ఞప్తి చేశారు.

నీటి సమస్య పరిష్కరించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కందుకూరు: తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అశోక్, దయాకర్ తదితరులు మాట్లాడుతూ... మిషన్ భగీరథ ద్వారా గ్రామానికి 1.60 లక్షల లీటర్ల నీరు సరఫరా కావాల్సి ఉండగా కేవలం 50 వేల లీటర్లు మాత్రమే సరఫరా అవుతున్నాయన్నారు. దీంతో గ్రామంలో తాగునీటికి తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. సమస్య పరిష్కరించాలని వారు కోరారు. వారి వెంట గ్రామస్తులు బాలరాజు, కృష్ణయ్య పాల్గొన్నారు.

వేడుకకు వెళ్లొస్తూ.. అనంత లోకాలకు

ఇబ్రహీంపట్నం రూరల్: వివాహ వేడుకకు హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా డివైడర్ వద్ద యూటర్న్ చేసుకుంటున్న ఆటోను బైక్ ఢీకొట్టడంతో ఓ మహిళా దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. తుర్కయంజాల్ కట్ట కింద ఉన్న సుందరయ్యనగర్‌లో నివాసం ఉండే వి.కవిత, వి.రాములమ్మలు ఆటోలో మన్నెగూడ సమీపంలో ఉన్న జేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో రాత్రి వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరిగి రాత్రి 11:45 నిమిషాలకు ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో తుర్కయంజాల్ చెర్వు కట్టపై ఉన్న బుద్ధ విగ్రహం వద్ద యూటర్న్ చేసుకుంటుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కవిత(48) తలకు తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఆటోలో ఉన్న రాములమ్మ, డ్రైవర్ హేమకు తీవ్ర గాయలయ్యాయి.

పన్నులపై నజర్



మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం

మీర్‌పేటలో నూరు శాతం వసూలే లక్ష్యంగా ప్రణాళిక

మీర్‌పేట: ఆర్థిక సంవత్సరం ముగియనున్న తరుణంలో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. 2024–25 గాను ఆస్తిపన్ను వసూలు లక్ష్యం రూ.20.60 కోట్లుగా నిర్ణయించారు. కార్పొరేషన్‌లో మొత్తం 20,720 గృహాలు ఉండగా, కమర్షియల్/రెసిడెన్షియల్ కలిపి దాదాపు 1,500 వరకు ఉన్నాయి. ఇప్పటివరకు 46 శాతం అంటే రూ.10 కోట్ల వరకు పన్నులు వసూలైనట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 31 నాటికి వంద శాతం ఆస్తి పన్ను లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని సిబ్బందికి దిశానిర్దేశం చేసినట్లు అధికారులు తెలిపారు.

ఐదు బృందాలతో

వసూళ్లలో వేగం పెంచేందుకు ఐదు బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో 7 నుంచి 10 మంది వరకు సిబ్బందిని నియమించినట్లు రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నివాస గృహాలతో పాటు ముఖ్యంగా ట్రేడ్ లైసెన్సు, ఎల్ఆర్ఎస్ ఫీజుల వసూలుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఇంటి పన్నులు పెరిగాయని, తగ్గించాలని కొన్ని చోట్ల కాలనీలవాసులు సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్నప్పటికీ, వారికి అవగాహన కల్పించి పన్ను చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వివరించారు.

నోటీసులు జారీ చేస్తున్నాం



కార్పొరేషన్‌లో మొండి బకాయిదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాం. రెండేళ్లకు పైబడి బకాయిలు చెల్లించని యజమానులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నాం. పట్టణ ప్రజలంతా గడువులోగా ఆస్తిపన్నులు చెల్లించాలి.
– జ్ఞానేశ్వర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్

మూడో రోజు ప్రశాంతం

మహేశ్వరం: మండలంలోని ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలైన ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ కళాశాల, మహాత్మా జ్యోతిరావుఫూలే కళాశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలో మొత్తం 1,895 మంది విద్యార్థులకు 1,872 మంది హాజరయ్యారని మండల కస్టోడియన్ అధికారి నర్సయ్య తెలిపారు.

అంగన్‌వాడీ సేవలకు పురస్కారాలు



జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మంజుల



శోభను సత్కరిస్తున్న కలెక్టర్

మహేశ్వరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రాల్లో అత్యుత్తమ సేవలందించినందుకు జిల్లా స్థాయిలో పురస్కారాలు వరించాయి. ఈ మేరకు సిరిగిరిపురం, తుక్కుగూడ అంగన్‌వాడీల టీచర్లు ఇంద్రకంటి మంజుల, సప్పిడి శోభలు ఎంపికయ్యారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డుతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. మహేశ్వరం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన ఇంద్రకంటి మంజుల అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో గ్రామంలో ఉండే ఒంటరి మహిళ కుండె యాదమ్మ మానసిక పరిస్థితి సరిగా లేదు. ఆమెకు ఏడేళ్ల కుమారుడు సురేష్ ఉన్నాడు. దీంతో అంగన్‌వాడీ టీచర్ మంజుల అన్ని తానై సురేష్‌ని అక్కున చేర్చుకొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోమ్‌లో(హాస్టల్) చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించింది. అతడు ఇంటర్ వరకు చదివించి అనంతరం కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. తుక్కుగూడకు చెందిన అంగన్‌వాడీ టీచర్ సప్పిడి శోభకు గ్రామంలో స్నేహపూర్వకంగా ఉంటూ పిల్లలను కేంద్రంలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న మంజుల, శోభ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అవార్డులు రావడం గర్వంగా ఉందని, మాపై బాధ్యతను పెంచిందని భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి, ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మహేశ్వరం: మహిళలు అన్ని రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. పురుషులతో సమానంగా ముందుండాలి. పోలీస్ వ్యవస్థలో హోంగార్డు నుంచి ఎస్పీ వరకు అతివలున్నారు. దేశంలో ఏ రాష్ట్రాల్లో లేని విధంగా మహిళలకు రక్షణగా షీ టీమ్ ఉంది. మనల్ని చూసి ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నారు. ఈ రోజుల్లో ప్రతి ఇంట్లో ఆడపిల్ల కావాలనే ఆలోచన బలపడింది. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళ ప్రస్తుతం విమానాలు నడపడం, రాజ్యాలను పాలించే స్థాయికి ఎదగడం గర్వకారణం.
– సునీతారెడ్డి, డీసీపీ, మహేశ్వరం

మహిళలు పాడి పరిశ్రమలో రాణించాలి



చిప్పలపల్లిలో పశువుల మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

కందుకూరు: మహిళలు పాడి పరిశ్రమలో రాణించేలా తమ వంతు సహకరిస్తున్నామని మండల పశువైద్యాధికారి రేవతి తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని చిప్పలపల్లిలో విర్‌బాక్ కంపెనీ ఆధ్వర్యంలో మహిళా రైతులతో పశు పోషణపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాల దిగుబడి, నట్టల నివారణ ప్రాముఖ్యత తదితర అంశాలపై వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు సంఘాలుగా ఏర్పడితే పాల ధరను తామే నిర్ధారించుకుని విక్రయించవచ్చన్నారు. విర్‌బాక్ కంపెనీ నుంచి మహిళలకు పశువుల మందులు పంపిణీ చేశారు. విర్‌బాక్ కంపెనీ మేనేజర్ అనిల్‌కుమార్, వెంకటేష్, డాక్టర్ సాజిత్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో లార్డ్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవిద్యావికాస్ 20వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యులుగా ప్రముఖ వైద్యులు తుమ్మ తేజశ్విని, శుభోదిని హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు విలువైన కాలన్ని దుర్వినియోగం చేసుకోవద్దని సూచించారు. అనుకున్న లక్ష్యంతో ముందుకు సాగితే విజయం మీ ముంగిటనే నిలుస్తుందన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు, డ్యాన్సులు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బైర్లు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత, డీన్ సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ శివాని ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి కటకట



దావూద్‌గూడ తండాలో వ్యవసాయ బోర్ల నుంచి బిందెలతో నీరు తెచ్చుకుంటున్న మహిళలు

కందుకూరు: మండల పరిధిలోని దావూద్‌గూడ తండాలో తాగునీటి సమస్యతో అక్కడి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 20 రోజులుగా మిషన్ భగీరథ నీరు గ్రామానికి సరఫరా కాకపోవడంతో మహిళలు బిందెలు తీసుకుని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు లేదని వాపోతున్నారు. తండా పరిధిలో ఉన్న రెండు బోర్లు పాడైయ్యాయని, వాటికి మరమ్మతులు చేయిస్తే కొంత మేర సమస్య పరిష్కారం అవుతుందంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

లిఫ్ట్ అడిగి.. మృత్యు ఒడిలోకి

పట్టు తప్పడంతో కింద పడి దుర్మరణం



నర్సింహ (ఫైల్)

మహేశ్వరం: బైక్ అదుపు తప్పడంతో వెనకాల కూర్చున్న వ్యక్తి కిందపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... ఘట్టుపల్లి గ్రామానికి చెందిన ఎర్ర నర్సింహ(38) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయన మన్సాన్‌పల్లి నుంచి స్వగ్రామానికి బిహార్ రాష్ట్రానికి చెందిన సూరజ్ బైక్‌ను లిఫ్ట్ అడిగి వెనకాల కూర్చున్నాడు. ఈ క్రమంలో సరిగా పట్టుకోకపోవడంతో బైక్‌పై నుంచి నర్సింహ కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడు అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. బైక్ నడుపుతున్న సూరజ్‌కు సైతం గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

మీర్‌పేట: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. వనపర్తి పట్టణానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(55) కర్మన్‌ఘాట్‌లో నివాసముండే కూతురి వద్దకు గురువారం వచ్చాడు. సాయంత్రం 5 గంటలకు నాగోలులో ఉండే స్నేహితున్ని కలిసేందుకు వెళ్లాడు. తిరిగి రాత్రి 11.30 గంటలకు బస్సులో టీకేఆర్ కమాన్ వద్ద దిగి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన చింటు అనే వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో చంద్రశేఖర్‌రెడ్డి తలకు బలమైన గాయాలు కావడంతో సంఘటనా స్థలిలోనే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్ఆర్ డెవలపర్స్ శ్రీనివాస్‌రెడ్డి, హరికృష్ణ సహకారంతో విద్యార్థులకు 300 ప్లేట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు హరికృష్ణ ముదిరాజ్, ఎస్ఐ మధుసూదన్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ శంకయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, గ్రామస్తులు అంధ్యానాయక్, రాములు, లాజర్, పరమేష్, చంద్రయ్య, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.